

# డాక్టర్‌గారి భార్య

## – కొమ్మూరి వేణుగోపాలరావు



(గత సంచిక తరువాయి)

**ఇప్పుడెక్కడికి పోవాలి?** జీవితం సర్వనాశనం అయింది. ఎవరో సంబంధం లేనివారు, ముక్కూ మొహం ఎరగనివారు, తన దారిన తాను ఎవరితో ప్రమేయం లేకుండా బ్రతుకుతున్నదాన్ని నిర్లక్ష్యంగా, నిర్దయగా, అర్థం లేకుండా సర్వనాశనం చేసి తమ దారిన తాము నవ్వుకుంటూ వెళ్ళిపోయారు. ఇంటికెళ్ళటానికి భయమేసింది. అత్తకేమని చెప్పాలి?

కాసేపు ఆలోచించి ఎటూ తోచక డాక్టరుగారి దగ్గరకి వెళ్ళి సలహా తీసుకుందామనుకుంది. రిక్షాలో వెళ్ళడానికి డబ్బులు లేవు. అలాగే నడుచుకుంటూ హాస్పటల్‌కు వచ్చింది.

నరేష్ గుండె అంతా కెలికివేసినట్లయింది.

గత రెండు నెలల్లో ఇటువంటి సంఘటనలే రెండు అతని దృష్టికి వచ్చాయి.

ఒకామె – ఏడోనెల గర్భిణీ. హాస్పటల్‌కి వచ్చి ఎగ్జామిన్ చేయించుకుని మందు తీసుకుని ఇంటికి వెళుతోంది. అప్పటికి చీకటి పడింది. రిక్షా కోసం అటూ ఇటూ చూస్తూండగా ఒక కారు వచ్చి ప్రక్కన ఆగింది. ఏమి జరిగిందో తెలుసుకునే లోపల కారులోంచి కొందరు మనుషులు ఆమెను లోపలకు లాగేశారు. భయంతో, షాక్‌తో ఆమె రక్తం గడ్డ కట్టుకుపోయింది. ఒకతను కత్తి తీసి మెడకు ఆనించి "అరిస్తే చంపేస్తా" అన్నాడు. గజగజ వొణికిపోయి కిక్కురుమనకుండా కూర్చుంది. ఆమె మెళ్ళో వున్న చంద్రహారం, మంగళసూత్రాలు, చేతిగాజులు వొలుచుకుని నిర్మానుష్యంగా వున్న ప్రదేశంలో పడేసి వెళ్ళిపోయారు. కనికరించినట్లు అంతకన్నా ఇంకేం చెయ్యలేదు.

ఇంకో స్త్రీ _ ఆమె కూడా నరేష్ పేషెంటే – ఆమె భర్తతో కలసి ఓ చిన్న యింట్లో కాపురముంటోంది. ఆమె ఎదురుగుండా ఉన్న ఇంట్లో ఓ స్వాములవారిలాంటి ఆయన ఉంటున్నాడు. ఎప్పుడూ ఏవేవో పూజలు చేస్తూండేవాడు. ప్రశ్నలడగటానికీ, సలహా సంప్రదింపులకూ చాలామంది ఆయన దగ్గరకు వస్తూండేవారు. కార్లలో కూడా వచ్చి వాళ్ళ ఊళ్ళకి తీసుకెడుతూ వుండేవారు. ఆయన పూజా మహిమలతో బాటు దీర్ఘరోగాలకు కూడా మందులిస్తూ వుండేవాడు. తాయెత్తులు కడుతూ ఉండేవాడు.

ఆమెకు మొదట నమ్మకం కలగలేదుగానీ, పెళ్ళయి అయిదారేళ్ళయినా పిల్లలు లేకపోవటం చేత వాళ్ళూ వీళ్ళూ నూరిపోస్తే ఏ పుట్టలో ఏ పామున్నదో అనుకుని భర్తతో కలిసి ఆయన దగ్గరకు వెళ్ళటం మొదలు పెట్టింది ఆయన మేధస్సు, వాగ్ధాటి, నిర్విరామంగా చేసే పూజలు క్రమంగా ఆమెకు గురి ఏర్పడింది.

ఒక రోజు ఆయన ఆమెకోసం అదేదో గొప్ప పూజ చేయటానికి సంకల్పించాడు. ఆ సంకల్పం కూడా సరిగ్గా ఆమె భర్త ఊళ్ళోలేని రోజే కలిగింది. అంతేగాక ఆయన నివాసంలో అయితే వాళ్ళూ వీళ్ళూ వచ్చి ఆ గొప్ప పూజకు అంతరాయం కలిగిస్తారు కాబట్టి – ఆమె ఇంటికొచ్చి మూడో కంటివాడికి తెలియకుండా అక్కడే చేస్తాడు. భర్త ఊళ్ళో లేదు కదా, ఆయన ఉన్నప్పుడు చేస్తే బాగుంటుందేమో అన్న సందేహం ఆమె వ్యక్తం చేసింది."ఇది చాలా పర్వదినం. ఇలాంటి రోజు పదేళ్ళకు ఒకసారిగానీ రాదు. పూజ యీ రోజునే జరిగి తీరాలి" అని ఆయన సాధికారంగా ప్రకటించాడు. ఆమె ఒప్పుకోక తప్పలేదు.

రాత్రి పదిగంటల దాకా ఏవేవో పూజలు చేశాడు. మంత్రాలు ఉచ్చరించాడు. హారతులిచ్చాడు.

అంతసేపూ ఆమెను ఎదురుగానే కూర్చోబెట్టుకున్నాడు. మధ్య మధ్య ఏవో పనులు – పూజా కార్యక్రమంలో భాగాల్లాంటివి పురమాయిస్తున్నాడు.

తర్వాత 'హం ' 'హాం ' అని ఏవో మంత్రాలు ఉచ్చరించి ఆమెకు తీర్థం ఇచ్చి తాగమన్నాడు.

ఆమె త్రాగింది.

కళ్ళు మూతలు పడసాగాయి. ఏదో మైకం ఆవహిస్తోంది.

"ఏ...మి...టి..ది?" అన్నది.

అతను నవ్వటం తెలిసింది.

కళ్ళు తెరిచి చూసేసరికి మంచం మీద పడి వుంది. జాకెట్ గుండీలు వూడి వున్నాయి. చీర అస్తవ్యస్తంగా వుంది.

తల ప్రక్కకి త్రిప్పి చూసేసరి ఆయన ఏదో మంత్రాలుచ్చరిస్తూ రెండు చేతులతో మూలగా చెవులు పట్టుకుని గుంజీళ్ళు తీస్తున్నాడు.

ఆమెకు... తన శరీరం... కొంచెం కొంచెం అర్ధమవుతోంది.

"లేచావా?" అన్నాడు

"దేముడు నిన్ను కనికరించాడు."

"ఏమిటి చేస్తున్నావు?"

"నిమిత్తమాత్రంగా ఉపయోగపడిన ఈ దేహానికి పాప పరిహారం."

ఆమె ఓపిక చేసుకుని లేచి కూర్చుని "దుర్మార్గుడా! ఇక్కడ్నుంచి వెళ్ళు" అని అరిచింది.

"నే చెప్పేది..."

"ఏమీ చెప్పనక్కర్లేదు. ఇంకెప్పుడూ నీ మొహం చూపించకు."

తన గొప్పతనం ఆమెకు అర్థం కానట్లు ఓ భంగిమ ప్రదర్శించి అక్కడ్నుంచి నిశ్శబ్దంగా వెళ్ళిపోయాడు.

ఆమె ప్రక్కమీద వాలిపోయి, తల బాదుకుని కుమిలి కుమిలి ఏడ్చింది.

తర్వాత భర్తతో ఏవో సాకులుచెప్పి దూరంగా వున్న యింకో యింట్లోకి వెళ్ళిపోయింది.

కాని..ఆ సమస్య అంతటితో ఆగలేదు.

ఆమె గర్భవతి అయింది. ఇదంతా స్వాములవారి మహిమేనని భర్త సంతోషించి వెళ్ళి ఆయనకు పాదపూజ చేసి వచ్చాడు.

ఆమె గర్భస్రావం చేసుకుందామని ఎంతో ప్రయత్నించింది. కుదరలేదు. నాటుమందులు వాడింది. ఫలించలేదు.

నరేష్ దగ్గరకొచ్చి తన కథంతా చెప్పి ఎబార్షన్ చెయ్యమని అడిగింది.

అతని హృదయం ద్రవించింది. కాని... ఆమె భర్త అనుమతి లేకుండా చెయ్యటానికి వీల్లేదు. అసలు విషయం తెలియని ఆమె భర్త ఒప్పుకోడు. తెలిస్తే పుట్టబోయే బిడ్డనేకాదు, ఆమెకు కూడా తిలోదకాలివ్వవచ్చు.

ఆమెకు గర్భవిచ్ఛిత్తి జరగలేదు.

"ఇప్పుడేం చెయ్యను?" అనడిగింది అంజన.

నరేష్‌కు కూడా రక్తం ఉడికిపోతోంది.

"అన్యాయాన్ని ఎదిరించదల్చుకుంటే పోలీస్ కంప్లైంట్ యివ్వాలి" అన్నాడు.

ఆమె నిస్పృహగా తలాడించింది. "అంత శక్తి లేదు. బయటపడి యీ సమాజంలో బ్రతకలేను."

"మరి...?"

"ఎప్పటికైనా బావ వస్తాడు."

"ఆ రాక్షసుడిమీద నీకింకా ప్రేమ వుందా?"

"అతను రాక్షసుడంటారా?

"కాక? సమాజం దయాదక్షిణ్యాలమీద నిర్దయగా నిన్ను వదిలిపోయిన అతన్ని ఏమనాలి?"

"ఏదన్నా బలీయమైన పరిస్థితికి లోబడి వుండవచ్చు కదా."

"ఎంత బలీయమైన పరిస్థితి అయినా సరే అతని చర్య ఏ విధంగానూ సమర్ధనీయం కాదు.

"అయినా సరే" అన్నట్లు తల ఆడించింది.

"ఎంత అజ్ఞానం" అనుకున్నాడు ఆశ్చర్యంగా.

"ఇంటికి ఎలా వెళ్ళను?" అనడిగింది.

అతను ఓ ఉపాయం ఆలోచించాడు. "ప్రెస్‌కు వెళుతుంటే దార్లో చిన్న యాక్సిడెంటయితే హాస్పిటల్‌కు తీసుకెళ్ళారనీ, యిప్పటిదాకా బెడ్‌మీద వుంచి యిప్పుడే పంపించారనీ చెప్పు."

ఆమె కృతజ్ఞతలు చెప్పి లేచి నిలబడింది.

"నడిచి వెళ్ళలేవు. యిది వుంచు" అని జేబులోంచి అయిదు రూపాయల నోటు తీసి అందిచ్చాడు.

కాదనే శక్తి ఆమెకు లేదు. అందుకని మౌనంగా బయటకు వెళ్ళిపోయింది.

ఓ సాయంత్రం హాస్పటల్ ముందు కారాగింది. అందులోంచి కంగారుగా ఓ నడివయసు మనిషీ, ఓ యువకుడూ, ఓ యిరవై ఏళ్ళ యువతిని లోపలకు మోసుకొచ్చారు.

ఆ యువతి స్పృహ తప్పి వుంది. నోట్లోంచి కొద్దిగా నురగ వస్తోంది.

పల్స్ చూశాడు. కనుపాప తెరిచి టార్చిలైట్ వేసి ప్యూపిల్ చూశాడు. పిన్‌పాయింటెడ్‌గా వుంది.

"ఏం జరిగింది?" అన్నాడు నరేష్.

"ఏదో మింగినట్లుగా వుంది. ఎప్పుడు మ్రింగిందో తెలీదు. మధ్యాహ్నం పడుకున్నది యింతవరకూ లేవకుండా వుంటే అనుమానమొచ్చి చూశాను. ఎంత లేపినా కదలకపోతే తీసుకొచ్చేశాను" అన్నాడు ఆ నడివయసు మనిషి.

స్లీపింగ్ టాబ్లెట్స్ మింగి వుంటుంది. ఎండ్రిన్ అయిఏ వాసన తెలుస్తుంది.

ఇంకా పెళ్ళయినట్లుగా లేదు. ఆమె ముఖం చాలా అందంగా సుకుమారంగా వుంది.

"పాయిజన్ కేసు కదా గవర్నమెంట్ హాస్పటల్‌కు తీసుకెడితే బాగుంటుందేమో" అన్నాడు సందేహిస్తూ.

"అక్కడకు వెళితే పోలీస్ కేసవుతుంది. అది నా కిష్టంలేదు" అన్నాడు ఆయన.

"పల్స్ ఫీబుల్‌గా వుంది. రిజల్ట్ ఎలా వుంటుందో చెప్పలేను.

"కానివ్వండి. మీప్రయత్నం మీరు చెయ్యండి" అన్నాడాయన.

నరేష్‌కు తప్పలేదు. గబగబా అన్నీ సిద్ధం చేసుకుని స్టమక్ వాష్ చేసేశాడు. డీప్ కోమాలో వుండబట్టి స్టమక్ ట్యూబ్ ప్యాస్ చెయ్యటం కష్టం కాలేదు.

తర్వాత మెజిటమైడ్, యాంటీబయాటిక్ ఇంజక్షన్లు చేసి గ్లూకోజ్ డ్రిప్ స్టార్ట్ చేశాడు. మధ్యలో కొన్ని కాంప్లికేషన్లు వచ్చాయి,

యూరినరీ రిటెన్షన్ వచ్చి పొట్ట ఉబ్బిపోయింది. కేథడ్రైజ్ వేశాడు. రెస్పిరేటర్ ఫెయిల్యూర్ వచ్చింది. ఆక్సిజన్ పెట్టాడు.

మొత్తం మీద నాలుగయిదు గంటలు గడిచేసరికి పరిస్థితి మెరుగైంది.

మరునాటి ఉదయానికి కొద్దిగా తెలివొచ్చింది. తెలివ్చాక ఫిట్స్ రావటం మొదలు పెట్టాయి. డ్రిప్‌లో కాల్షియం గ్లూకోనైట్ కలిపాడు.

సాయంత్రానికి క్రమక్రమంగా కోలుకుంది.

ఆ నడివయసు మనిషి ఆమె తండ్రి అని అర్థం చేసుకున్నాడు.

యువకుడెవరో తెలియలేదు.

వాళ్ళిద్దరి ప్రవర్తనా విచిత్రంగా అనిపించింది. తండ్రి యాంత్రికంగా, కర్తవ్యానికి లోబడినట్లు చేస్తున్నాడు.

యువకుడి ముఖంలోకి చూశాడు.

"థాంక్స్! నా జీవితాన్ని యింకా కొన్ని రోజులు పొడిగించినందుకు"

అతనేమీ మాట్లాడలేదు.

"ఒకసారి చనిపోవాలన్న కోరిక కలిగాక బ్రతకటం అసాధ్యమన్న సంగతి మీకు తెలీక పోదు."

"జీవిత గమనం మార్చుకోదల్చుకుంటే సాధ్యమన్న విషయం కూడా నాకు తెలుసు."

"మార్చుకోవటం మన చేతుల్లో లేకపోతే?"

"...ఆత్మహత్య మానసిక చాపల్యమని నా ఉద్దేశం."

ఆమె నవ్వింది. "అది మనస్తత్వ ప్రవీణుల ఉద్దేశం కూడా. మేధావులు నిజంలోని బలహీనతను గురించి ఆలోచిస్తారుగాని, అందులోని బలాన్ని తెలుసుకోలేరు."

అతనేం జవాబు చెప్పలేదు.

ఆ మరునాడు ఆమెను డిశ్చార్జి చేసేశాడు.

తనను కొన్ని రోజుల క్రితం లెప్రస్ గురించి ఫోన్ చేసిన యువతీ, యీ యువతీ ఒకరని అతనికి తెలియదు.

పేషెంట్లలో రకరకాలుంటారు. కొంతమంది అవకాశమున్నా హాస్పటల్‌కి రారు. ఇంటికి రమ్మని వేధిస్తారు. కాదని నిరాకరించటానికి సభ్యత, మొహమాటం, మానవతాదృక్పథం – యిన్ని వుంటాయి. ఇక్కడ ఎంతో మంది వెయిట్ చేస్తున్న వాళ్ళని విడిచిపెట్టి అక్కడకు పోవాలంటే మనసుకు బాధగా వుంటుంది. తీరా వెడితే పేషెంట్ బాత్‌రూములో వున్నాడనో, ఇంకేదో చెప్పి కాసేపు వెయిట్ చేయిస్తారు. అక్కడ వాతావరణం ఎలా వుంటుందంటే ఈ డాక్టరే పని వుండి వాళ్ళ కోసం వెళ్ళినట్లు వుంటుంది.

అక్కడ్నుంచి  కాఫీయో, కూల్‌డ్రింకో యిస్తారు. ఒద్దన్నా వినిపించుకోరు.

అసలు పేషెంటుతోబాటు, బంధువో, ఆ యింటికొచ్చిన అతిథో డాక్టర్‌ని చూడగానే రోగం గుర్తుకొచ్చి పనిలో పనిగా తాను కూడా పరీక్ష చేయించుకుంటాడు.

కొంతమంది డాక్టర్ని చూడగానే ఎక్కడ లేని రోగాలూ గుర్తుకువస్తాయి.

ఒకసారి ఆల్ యిండియా రేడియోకు యిమ్యునైజేషన్ మీద టాక్ యివ్వటానికి వెళ్ళాడు.

ఆ ఎనౌన్సర్ ప్రసంగానికి ముందూ, ప్రసంగం అయాకా అతన్ని తన శారీరక రుగ్మతలని గురించిన చిక్కు ప్రశ్నలతో వేధించి పారేశాడు.

ఇంకోసారి వీలు చూసుకుని ఓ పెళ్ళి తాలుకు డిన్నర్‌కి వెళ్ళాడు. ప్రక్కన ఒకాయన కూర్చున్నాడు.

ఆయనకు డయాబిటిస్.

స్వీట్ తింటూ డయాబిటిస్ పథ్యం గురించి అడిగాడు. బంగాళ దుంపలు తింటూ ఏవి తినకూడదో అడిగాడు.

చేతినిండా నెయ్యి పోసుకుంటూ సీరం కొలెస్ట్రాల్ ఎందుకొస్తుందని ప్రశ్నించాడు.

ఒక లావుపాటి పిన్నిగారు వస్తుంది. తనకు ఒళ్ళు తగ్గే ఉపాయం చెప్పమంటుంది.

ఆవిడకి నడక అంటే గిట్టదు. ఆసనాలెయ్యటానికి ఒళ్ళు వంగదు. తిండి తగ్గించమంటే "అబ్బే! నేనేం తింటానూ. రెండు నిమ్మకాయలు" అంది.

"ఏమిటి? రెండు నిమ్మకాయలు తింటారా?" అన్నాడు నరేష్ ఆశ్చర్యంగా.

"అదేనండి. రెండు నిమ్మకాయలంత అన్నం" అన్నది.

సాధారణంగా మొగవాళ్ళు ఉద్యోగాలకు వెళ్ళి ఆడవాళ్ళే ఎక్కువగా వస్తూ ఉంటారు హాస్పటల్స్‌కు.

నరేష్‌కు మామూలుగా ఎవరైనా కొత్త పేషెంటు వచ్చినపుడు మొగవారైతే "మీరేం చేస్తుంటారు?" అనీ, ఆడవారయితే "మీవారేం చేస్తుంటా"రనీ అడగటం అలవాటు.

ఒకసారి ఓ ఇరవై అయిదేళ్ళ స్త్రీ వచ్చింది. పిల్లాడిని చూపించటానికి. ప్రక్కన అత్తగారు కావచ్చు. వెంట వున్నది.

"మీ వారేం చేస్తూంటారు?" అనడిగాడు.

"ఇంట్లో కూర్చుని భోంచేస్తూ వుంటారు" అన్నది తపీమని.

అదిరిపడి ఆమె ముఖంలోకి చూశాడు.

తన భర్త, ఏమీ ఉద్యోగం చెయ్యటంలేదన్న ఉక్రోషం, వ్యంగ్యం, సెన్స్ ఆఫ్ హ్యూమర్ అన్నీ కనిపించాయి ఆమె ముఖంలో.

గమ్మత్తేమిటంటే ఆమె అత్తగారు కూడా ఫక్కుమని నవ్వింది కోడలు వదిలిన బాణాన్ని స్పోర్టివ్‌గా తీసుకుని.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS